క్లుప్తంగా

యోగాపై అవగాహన



జెడ్పీ మైదానంలో శిక్షణ ఇస్తున్న మేఘన

మంచిర్యాలటౌన్/చెన్నూర్: జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, చెన్నూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానాల్లో ఈ నెల 21న యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం యోగ శిక్షకులు మేఘన, మోర్ల మధుకర్, గాదె రజిత వాకర్స్, ఫిట్‌నెస్ సభ్యులకు యోగాపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ముక్త వేణు, శ్రీనాథ్, రవి పుత్తూరి, విజయ్, మల్యాల శ్రీపతి, గట్టయ్య పాల్గొన్నారు.

ప్రీ ప్రైమరీ తరగతులు ప్రారంభం



విద్యార్థులపై పూలు చల్లుతున్న ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు

దండేపల్లి: మండలంలోని గుడిరేవు, రెబ్బనపల్లి ప్రాథమిక పాఠశాలల్లో ప్రీ ప్రైమరీకి అనుమతులు వచ్చాయి. దీంతో ఆ పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ తరగతులను ఎంఈవో చిన్నయ్య గురువారం ప్రారంభించారు. పాఠశాలల్లో కొత్తగా చేరిన నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ విద్యార్థులపై పాఠశాల సిబ్బంది, తల్లిదండ్రులు పూలు చల్లి లోపలికి తీసుకెళ్లారు.

దుకాణాల కూల్చివేత



దుకాణాలు కూల్చివేస్తున్న కార్పొరేషన్ సిబ్బంది

మంచిర్యాలటౌన్: పట్టణంలోని మార్కెట్‌లో రోడ్ల వెడల్పు పనుల్లో భాగంగా విశ్వనాథ ఆలయం ఎదుట ఉన్న దుకాణాలను గురువారం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో కూల్చివేశారు. ఇక రోడ్డు వెడల్పు పనులను చేపట్టేందుకు మార్గం సుగమమైంది.

పెన్షన్లపై విచారణ

భీమిని: మండలంలోని గ్రామాల్లో వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు ఇచ్చే పెన్షన్లలో రూ.16 చెల్లించడం లేదని పలువురు ఫిర్యాదు చేయడంతో అధికారులు గురువారం విచారణ చేపట్టారు. బీపీఎంలు చిన్నగుడిపేట గ్రామాన్ని సందర్శించి పెన్షన్లు సరిగ్గా ఇస్తున్నారా.. లేదా అని ఆరా తీశారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో గంగామోహన్, పోస్టల్ ఎంక్వయిరీ ఆఫీసర్ (ఏపీవో) ఎండీ అబ్దుల్ సలీం, హెచ్‌ఆర్ మేనేజర్ రమేశ్, ఏపీఎం శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

దండేపల్లి: ఎన్నికల సమయంలోనే పేదలు, ఆ తరువాత వారిపై పాలకులకు పట్టింపు ఉండదని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మేకల దాసు ఆరోపించాడు. దండేపల్లి రాజలింగయ్య కాలనీలో గురువారం దండేపల్లిలో సీపీఐ మండల మూడో మహాసభ నిర్వహించారు. ఈ నెల 21, 22తేదీల్లో మంచిర్యాలలో జిల్లా మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహాసభలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం సీపీఐ దండేపల్లి మండల కార్యదర్శిగా పెర్క రాజేష్, మరో 11మందిని సభ్యులుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో దేవవరం, కమల, భూమన్న, మారుతి పాల్గొన్నారు.

అమ్మమాట-అంగన్‌వాడీ బాట

చెన్నూర్: చెన్నూర్ లైన్‌గడ్డ అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో అమ్మమాట, అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా వీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పిల్లలకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ విజయ, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి విరాళం



నగదు అందజేస్తున్న ఉపాధ్యాయులు

వేమనపల్లి: క్యాన్సర్ వ్యాధితో మృతి చెందిన పాఠశాల విద్యార్థి దుర్గం శివర్ధన్ కుటుంబానికి మండల ఉపాధ్యాయులు అండగా నిలిచారు. కొత్తపల్లి ప్రాథమిక పాఠశాలలో రెండో తరగతి చదువుతుండగా, క్యాన్సర్ వ్యాధితో ఇటీవల మృతి చెందాడు. ఆ కుటుంబం ఆర్థికంగా చితికిపోయి ఉండటంతో ఉపాధ్యాయులు వారి దీనావస్థను గుర్తించి బాధిత కుటుంబానికి విరాళంగా రూ.25,300 అందించి అండగా నిలిచారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ బృందానికి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

ఘన స్వాగతం



జన్నారం: కలమడుగు ఉన్నత పాఠశాలలో...



లక్సెట్టిపేట: చప్పట్లతో స్వాగతం పలుకుతూ...



భీమారం: విద్యార్థులకు స్వాగతం పలుకుతూ...



జైపూర్: హైస్కూల్లో విద్యార్థులకు స్వాగతం



బెల్లంపల్లి: చిన్నారులను పాఠశాలకు తీసుకెళ్తూ...



దండేపల్లి: ద్వారకలో విద్యార్థులకు పూలతో స్వాగతం

సాక్షి నెట్‌వర్క్: వేసవి సెలవులు ముగియడంతో గురువారం పాఠశాలలు పునః ప్రారంభమయ్యాయి. దీంతో ఇన్ని రోజులు ఆటలతో గడిపిన విద్యార్థులు ఇక బడిబాట పట్టారు. తొలిరోజు పాఠశాలకు వచ్చిన విద్యార్థులకు ఉపాధ్యాయులు ఘన స్వాగతం పలికారు. పాఠశాలలను బెలూన్లు, మామిడాకుల తోరణాలతో అందంగా అలంకరించారు. రంగవల్లులు వేశారు. పాఠశాలల్లో కొత్తగా అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు పాఠశాల మిగితా విద్యార్థులు, బోధన సిబ్బంది అందరూ కలిసి పాఠశాల ముఖద్వారాల ఎదుట పూలిచ్చి స్వాగతం పలికారు. అనంతరం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అందించారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, అధికారులు పాల్గొన్నారు. మొదటిరోజు హాజరు శాతం అంతంతే నమోదు కావడం గమనార్హం.



వేమనపల్లి: నీల్వాయిలో...



తాండూర్: పాఠ్యపుస్తకాలు అందిస్తూ...



భీమిని: కన్నెపల్లి ఉన్నత పాఠశాలలో...



చెన్నూర్‌రూరల్: సుద్దాల జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో...



చెన్నూర్: కస్తూర్బాలో పిల్లలను తీసుకొచ్చిన తల్లులకు వెల్‌కమ్ చెబుతూ...



మందమర్రిరూరల్: విద్యార్థులకు స్వాగతం పలుకుతూ..



నెన్నెల: నందులపల్లిలో విద్యార్థులను స్వాగతిస్తూ...



నస్పూర్: విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తూ..

ఇంటర్ కళాశాలను సద్వినియోగం చేసుకోవాలి

కోటపల్లి: మండలకేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో నూతనంగా ప్రారంభమైన ఇంటర్ కళాశాల విద్యను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సెక్టోరల్ అధికారిణి యశోదర అన్నారు. కోటపల్లి కస్తూర్బా బాలికల కళాశాలలో గురువారం నూతన తరగతులను ప్రారంభించారు. కళాశాలలో విద్యార్థినుల సంఖ్య పెరిగేలా ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు చొరువ చూపాలన్నారు. అనంతరం నూతనంగా పాఠశాలకు వచ్చిన విద్యార్థినులకు నోట్‌బుక్స్‌తో పాటు యూనిఫాంలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మయ్య, ఎంపీవో అక్తర్, ఎస్‌వో హారిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఇంటర్ తరగతులు ప్రారంభిస్తున్న జిల్లా సెక్టోరల్ అధికారి యశోదర

రసాయనిక ఎరువులు మోతాదులో వాడాలి

కోటపల్లి: పంటలకు రసాయనిక ఎరువులు ఎక్కువగా వినియోగిస్తే ఎలాంటి ఉపయోగం ఉండదని, తగ్గిస్తే ఖర్చు ఆదా అవుతుందని కేంద్రీయ మెట్ట పరిశోధనసంస్థ శాస్త్రవేత్తలు టి.వి ప్రసాద్, నర్సింహులు అన్నారు. వికాసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని దేవులవాడ, రాంపూర్ గ్రామంలో గురువారం రైతులకు వ్యవసాయంలో మెళకువలు, సాంకేతికత, ఎరువుల మందుల వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏడీఏ బానోత్ ప్రసాద్, ఏవో సాయికృష్ణ, ఏఈవో వసుధ, శాస్త్రవేత్తలు వెంకటేశ్, విశాకుమారి, అన్షిదా బీవి, అభిషేక్ పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు

కోటపల్లి: చెన్నూర్ ఎమ్మెల్యే, కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామిపై సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు పెడుతూ కించపరిచిన బీఆర్‌ఎస్ సోషల్ మీడియా నాయకులపై చర్యలు తీసుకోవాలని గురువారం కోటపల్లి ఎస్సై రాజేందర్‌కు మండల కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో అల్లూరి సంపత్, రాజేశ్ పాల్గొన్నారు.

కేసులు నమోదు చేస్తాం

భీమారం: సామాజిక మాధ్యమాల్లో విద్వేషాలు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినా, పోస్టులు పెట్టినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై శ్వేత ఒక ప్రకటనలో తెలిపారు. అడ్మిన్‌లపై కూడా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఓటరు జాబితాలో పొరపాట్లు లేకుండా చూడాలి

నెన్నెల: ఒకే కుటుంబానికి చెందిన ఓటర్ల పేర్లు సంబంధిత ప్రాంతంలోని ఒకే పోలింగ్ కేంద్రం పరిధిలో ఉండేలా చర్యలు తీసుకోవాలని బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో గురువారం బూత్ లెవల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. బూత్ లెవల్ అధికారులు ఓటరు జాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా చూడాలన్నారు. ప్రస్తుత పోలింగ్ బూత్ రూల్స్ మారాయని, 1200ఓటర్లు దాటితే ఒక పోలింగ్ కేంద్రం ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలన్నారు. ఓటర్ల సౌకర్యార్థం పోలింగ్ కేంద్రం అందుబాటులో ఉంచాలని, అవసరమైతే కొత్తవి ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఓటరు ఐడీలో మార్పులు, చేర్పులకు బీఎల్‌వోలు సహకరించాలన్నారు. ఓటరు జాబితా ఆధారంగా స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ ప్రారంభమవుతుందని, ఓటరు జాబితాల్లో పొరపాట్లకు తావులేకుండా చూడాలని ఆదేశించారు. మైలారం, గొల్లపల్లిలో పోలింగ్ కేంద్రాలు ఏ ర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో తహసీ ల్దార్ మహేంద్రనాథ్, ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, ఎ స్సై ప్రసాద్, బూత్ లెవల్ అధికారులు పాల్గొన్నా రు.



బీఎల్‌వోలతో మాట్లాడుతున్న ఆర్డీవో హరికృష్ణ

'వ్యక్తిగత కక్షలు పెట్టుకోవడం దారుణం'

కోటపల్లి: ఫారెస్టు అధికారులు వ్యక్తిగత కక్షలు పెట్టుకొని, రైతు భూమిలో జేసీబీతో ట్రెంచ్‌ల ఐదు ఫీట్ల లోతు మట్టి తీయడం దారుణమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్ అన్నారు. పిన్నారం గ్రామానికి చెందిన సుంకె నగేశ్ అనే రైతు చేను దుక్కి దున్నుకున్న భూమిలో, ఫారెస్టు అధికారులు జేసీబీతో కందకాలు తవ్వగా బీజేపీ జిల్లా జనరల్ సెక్రటరీ దుర్గం అశోక్‌తో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుంకె నగేశ్ 50సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్న భూమిలో ఫారెస్టు అధికారులు జేసీబీతో ఐదుఫీట్ల మట్టి తవ్వడం ఏంటని ప్రశ్నించారు. ఎంతో మంది రైతులు ఉండగా నగేశ్ అనే రైతు పైనే పగబట్టి ఇలా వ్యవహరించడం తగదన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు స్వప్న, పున్నం చందు, నాయకులు మంత్రి రామయ్య, నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.



భూమిని పరిశీలిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్ గౌడ్, నాయకులు

ఇందిరమ్మ ఇళ్ల పంపిణీలో అంతా గోప్యం..!

- అర్హులకు ఇళ్ల పత్రాలు ఇవ్వకుండానే భూమిపూజ

మందమర్రిరూరల్: ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో అధికారులు అంతా గోప్యంగా ఉంచుతున్నారు. గ్రామ పంచాయతీల వారీగా ఎంపిక చేసే ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల కమిటీ, ఎంపీడీవో ఎంపిక చేసిన లబ్ధిదారుల పేర్లను బయటకు చెప్పకుండా మంజూరు పత్రాలు ఇవ్వకుండానే, ఒక్కో లబ్ధిదారుడి ఇంటికి వెళ్లి ముగ్గు పోసి, భూమిపూజ చేస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల కమిటీ ఎవరి పేరు సూచిస్తే వారే ఫైనల్ అయినట్లుగా ప్రచారం చేస్తూ, వాళ్లు మాత్రమే భూమిపూజలో పాల్గొంటున్నారు. తమకు ఇళ్లు రాలేదేమిటని ఇతర పార్టీల వారు, దరఖాస్తు చేసుకున్న వారు అధికారులను ప్రశ్నిస్తే దాటవేత ధోరణితో సమాధానం చెబుతున్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల పేర్లు ప్రకటించి మంజూరు పత్రాలు జారీ చేసిన తర్వాతనే నిర్మాణ పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై ఎంపీడీవో రాజేశ్వర్‌ను వివరణ కోరగా కలెక్టర్ ఆఫీస్ నుంచి ఇంకా ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపిక లిస్ట్ రాలేదని సమాధానం ఇచ్చారు.



ఆదిల్‌పేట్‌లో ఇందిరమ్మ ఇల్లుకు భూమిపూజ చేస్తున్న ఎంపీడీవో (ఫైల్)

నిబంధనల ప్రకారమే మార్కెట్ స్టాళ్లు ఇచ్చాం

బెల్లంపల్లి: సమీకృత కూరగాయల మార్కెట్ స్టాళ్ల (షెట్టర్ల) ను నియమ నిబంధనల ప్రకారమే కేటాయించామని బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇష్టారాజ్యంగా, మార్కెట్‌కు సంబంధం లేని వ్యక్తులకు మార్కెట్ షెట్టర్లను కట్టబెట్టారని ఇటీవల పలువురు చేసిన ఆరోపణలకు ఆయన వివరణ ఇచ్చారు. మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్, ఇతర వ్యక్తులు కూరగాయల మార్కెట్‌కు సంబంధం లేని వ్యక్తులకు స్టాళ్లను అప్పగించారని ఆరోపించడంలో వాస్తవం లేదని తెలిపారు. మార్కెట్ ప్రారంభించిన తర్వాత ఐదు నెలల వరకు స్టాళ్లు ఖాళీగా ఉండిపోవడంతో నిబంధనలు అనుసరించి కలెక్టర్ సమక్షంలో డ్రా తీసి గత మే 15న సభ్యులకు స్టాళ్లు ఇచ్చినట్లు, ఈ విషయాలు గ్రహించాలని ఆయన కోరారు.

టీడబ్ల్యూజేఎఫ్ సభ్యత్వ నమోదు



సభ్యత్వ నమోదు చేస్తున్న టీడబ్ల్యూజేఎఫ్ సభ్యులు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలో గురువారం టీడబ్ల్యూజేఎఫ్ యూనియన్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించి, పలువురు జర్నలిస్టులను యూనియన్‌లో చేర్చుకున్నారు. కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా మహాసభ సన్నాహక కమిటీ జిల్లా కన్వీనర్ మధు, కో కన్వీనర్ వెంకటస్వామి, సత్యగౌడ్, శ్రీనాథ్ పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం

- కలెక్టర్ కుమార్‌దీపక్

నస్పూర్: జిల్లాలో బాలకార్మిక వ్యవస్థను సమూలంగా నిర్మూలిద్దామని కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. ప్రపంచ బాలకార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని కలెక్టర్ చాంబర్‌లో గురువారం జిల్లా కార్మిక శాఖ సహాయ కమిషనర్ వెంకటరమణతో కలిసి బాల కార్మిక వ్యతిరేఖ దినోత్సవం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. బాలకార్మిక వ్యవస్థను సమూలంగా నిర్మూలించడానికి అందరం సమష్టిగా కృషి చేయాలన్నారు. అధికార యంత్రాంగం భాగస్వాములు కావాలని తెలిపారు. 18సంవత్సరాల లోపు పిల్లలను పనిలో పెట్టుకోరాదని సూచించారు. కార్యక్రమంలో సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సు సందర్శన

లక్సెట్టిపేట: రెవెన్యూ సదస్సులో దరఖాస్తు చేసుకునే లబ్ధిదారుల దరఖాస్తులను ప్రత్యేకంగా పరిశీలించి తీసుకోవాలని కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. మండలంలోని మోదెల గ్రామంలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సును గురువారం పరిశీలించి అధికారులతో మాట్లాడారు. రెవెన్యూ సదస్సులో రైతులు భూ భారతికి సంభంధించి దరఖాస్తు చేసుకుంటే అన్ని విధాల వారికి అవగాహన కల్పించాలన్నారు. అనంతరం నెహ్రూనగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ దిలీప్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ కుమార్‌దీపక్

రైతులకు జీలుగ విత్తనాలు పంపిణీ

బెల్లంపల్లి: రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేసిన రాయితీ జీలుగా విత్తనాలను గురువారం బెల్లంపల్లిలోని సహకార సంఘం కార్యాలయం ఆవరణలో జిల్లా వ్యవసాయ అధికారి కల్పన రైతులకు పంపిణీ చేశారు. బెల్లంపల్లి మండలంలో 333జీలుగ విత్తనాల బస్తాలు వచ్చినట్లు తెలిపారు. 30కేజీల బస్తా ధర సబ్సిడీతో కలుపుకొని రూ.2,138చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో చంద్రవెల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ చింతం స్వామి, బెల్లంపల్లి మండల ఏవో ప్రేమ్‌కుమార్, ఏఈవోలు శ్రీనివాస్, తిరుపతి, పాక్స్ సీఈవో వెంకటస్వామి, రైతులు పాల్గొన్నారు.



జీలుగ బస్తాలు పంపిణీ చేస్తున్న డీఏవో కల్పన

నేచురల్ గ్యాస్ వినియోగంపై అధ్యయనం

శ్రీరాంపూర్: పర్యావరణ పరిరక్షణలో భాగంగా నేచురల్ గ్యాస్ వినియోగంపై సింగరేణి అధ్యయనం చేస్తుందని శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాస్ తెలిపారు. శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్ అధికారి కార్యాలయంలో న్యాచురల్ గ్యాస్ వినియోగంపై గురువారం సమీక్ష నిర్వహించారు. కార్పొరేట్ జీఎం (ఈ అండ్ ఎం) డీవీఎస్ఎస్ఎన్ రాజు, పరిశీలన కమిటీ డైరెక్టర్ శంకర్ కారాజాగిలతో జీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓపెన్ కాస్ట్ గనుల్లో వినియోగించే భారీ యంత్రాలకు, ఇతర ఇంధన పరికరాలకు డీజిల్ వినియోగం వినియోగిస్తున్నట్లు తెలిపారు. ఈ డీజిల్ స్థానంలో నాచురల్ గ్యాస్ ఉపయోగించడానికి సాధ్యసాధ్యాలను పరిశీలించడం కోసం మహారాష్ట్ర నేచురల్ గ్యాస్ లిమిటెడ్ సంస్థ ప్రతినిధులతో అధ్యయనం చేయిస్తున్నామన్నారు. పర్యావరణహితమైన నేచురల్ గ్యాస్ ప్రోత్సహించాలన్నారు. అధ్యయనంలో సానుకూల ఫలితాలు వస్తే సంస్థకు ఆర్థికంగా లాభం కూడా జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్ అధికారి శ్రీనివాస్, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్ రెడ్డి, గని మేనేజర్ శ్రీనివాస్, ప్రాజెక్ట్ ఇంజనీర్ నాగరాజు, గని రక్షణ అధికారి శ్రీధర్, కమిటీ ప్రతినిధులు ఎస్‌కె సింగ్, సుజిత్ రాయికర్ తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న జీఎం శ్రీనివాస్

జీఎంకు బీసీ సంఘం వినతి

శ్రీరాంపూర్: సింగరేణి బీసీ, ఓబీసీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు గురువారం జీఎం కార్యాలయంలో జీఎం శ్రీనివాస్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. సింగరేణిలో బీసీ, ఓబీసీ ఉద్యోగుల సౌకర్యార్థం కంపెనీ క్వార్టర్‌ను కేటాయించాలని, అందులో అసోసియేషన్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాస్, సత్యనారాయణ, బరుపటి మారుతి, బద్రి బుచ్చయ్య పాల్గొన్నారు.

లాభాల వాటా ప్రకటించాలి

మందమర్రిరూరల్: సింగరేణిలో గత ఆర్థిక సంవత్సరం సంస్థకు వచ్చిన వాస్తవ లాభాలను వెంటనే ప్రకటించి ఉద్యోగులకు 35శాతం పంపిణీ చేయాలని హెచ్‌ఎమ్మెస్ ఏరియా ఉపాధ్యక్షుడు జక్కన బోయిన శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఏరియాలోని యూనియన్ ఆఫీస్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో ఆ యూనియన్ నాయకులు పార్వతి రాజిరెడ్డి, రామస్వామి, శ్రీనివాససరెడ్డి ఉన్నారు.

బొగ్గుబాయి వార్తలు

కాసిపేట-1 గనిపై బాయిబాట



మాట్లాడుతున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

కాసిపేట: సింగరేణి కార్మికుల సమస్యలపై ఎల్లప్పుడు స్పందించి పోరాటాలు చేస్తున్నది ఐఎన్‌టీయూసీ యూనియన్ అని ఐఎన్‌టీయూసీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ కాంపెల్లి సమ్మయ్య తెలిపారు. మందమర్రి ఏరియా కాసిపేట 1గనిపై గురువారం బాయిబాట కార్యక్రమంలో భాగంగా కార్మికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. యాజమాన్యంతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో భూమయ్య, శంకర్‌రావు, వెంకటస్వామి, లక్ష్మణ్‌దాస్ ఉన్నారు.

అధికారికి సన్మానం

శ్రీరాంపూర్: ఈ నెల 30న రిటైర్డ్ అవుతున్న సింగరేణి ఆప్మెల్ సంస్థ ఎండీ నాగరాజును శ్రీరాంపూర్ ఏరియా అధికారులు గురువారం ఘనంగా సన్మానించారు. జీఎం కార్యాలయంలో జీఎం శ్రీనివాస్ ఆయన్ను శాలువాతో సత్కరించి ఆయన సేవలను కొనియాడారు.

ఐఐటీ ఫౌండేషన్ కోర్సు విద్యార్థులకు వరం

బెల్లంపల్లి: ఐఐటీ ఫౌండేషన్ కోర్సులో చేరడం విద్యార్థులకు వరమని సీవోఈ కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌సాగర్ అన్నారు. బెల్లంపల్లి సీవోఈ పాఠశాల నుంచి ప్రీమియర్ సీవోఈ పాఠశాలల్లో 8వ తరగతిలో ఐఐటీ, నీట్ ఫౌండేషన్ కోర్సులకు ఎంపికైన విద్యార్థులను గురువారం అభినందించారు. పాఠశాల నుంచి అత్యధికంగా 15 మంది విద్యార్థులు గౌలిదొడ్డి, చిలుకూరు, ఇబ్రహీంపట్నం, ఉప్పల్ ప్రీమియర్ సీవోఈ పాఠశాలల్లో సీట్లు సాధించారని తెలిపారు.

విద్యాహక్కు చట్టం అమలు చేయాలి

మంచిర్యాలఅర్బన్: ప్రైవేట్ పాఠశాలల్లో విద్యాహక్కు చట్టం ప్రకారం 25శాతం సీట్లు కేటాయించాలని టీవీయూవీ రాష్ట్ర కార్యదర్శి చిప్పకుర్తి శ్రీనివాస్ ఎంఈవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయకుండా పేద, మధ్య తరగతి విద్యార్థులు, వారి తల్లిదండ్రులను మోసం చేస్తున్నారన్నారు.